క్లుప్తంగా

తపోవనం ఆశ్రమాన్ని సందర్శించిన టీటీడీ అధికారి



తపోవనంలో సరస్వతీ మహాస్వామి ఆశీస్సులు పొందుతున్న విభీషణ శర్మ

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమాన్ని శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఎస్వీఐహెచ్‌వీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ సందర్శించారు. తపోవనానికి వచ్చిన ఆయనకు వేదపండితులు, వేద విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఆశ్రమంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. సరస్వతీ మహాస్వామి విభీషణ శర్మను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



ఏలేశ్వరంలో రిటైర్డ్ ఉద్యోగి రామ్మోహనరావును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఏలేశ్వరం: పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగి పాండ్రింకి రామ్మోహనరావును శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల వైద్య శాఖలో ఉద్యోగ విరమణ చేసిన రామ్మోహనరావును శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తమ సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందుతారన్నారు. రామ్మోహనరావు తన సర్వీసులో నిస్వార్థ సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, పతివాడ జగదీష్, చందక కిరణ్, దాసరి గణేష్, అరవాల నాగరాజు, మద్దెలరమణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సలాది కృష్ణ

ప్రత్తిపాడు: నిరుపేద విద్యార్థులకు చేయూతను అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ కోరారు. ప్రత్తిపాడు బజారువీధి రామాలయం వద్ద శనివారం నిరుపేద విద్యార్థులకు సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చిన కిట్లను సలాది కృష్ణ విద్యార్థులకు అందజేశారు. పేదలకు ప్రతి నెలా క్రమం తప్పకుండా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఎంఎస్ సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ సంస్థ ప్రతినిధులు జి.సత్యానందం, భేరి రాంబాబు, ఎస్వీ సోమేశ్వరరావు, శిరసాల లక్ష్మి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

తుని: తొండంగి మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా క్యాంపు కార్యాలయంలో తొండంగి మండలం ఎ. కొత్తపల్లి సర్పంచ్ బెక్కం చంద్రగిరి ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి దాడిశెట్టి రాజా వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వ పటిమకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు నేతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీలోకి చేరిన వారికి మంత్రి రాజా సూచించారు.



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

సత్యదేవునిపై భక్తిగీతాలు రాస్తాను

మైసూర్ దత్త పీఠాధిపతి
శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ

అన్నవరం: త్వరలో సత్యదేవునిపై భక్తి గీతాలు రచించి, స్వామివారి సన్నిధిలో గానం చేస్తానని మైసూరు దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ తెలిపారు. శనివారం ఆయన రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. సత్యదేవుని ఆలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు ఒకే చోట దర్శనం ఇవ్వడంతో ఇది కూడా మరో దత్తాలయంగా తాను భావిస్తానన్నారు. పదేళ్ల క్రితం తాను ఈ క్షేత్రానికి వచ్చినప్పటికీ, నేటికి దేవస్థానంలో చాలా మార్పు వచ్చిందన్నారు. సత్యదేవుని వ్రతానికి చాలా విశిష్టత ఉండడంతో దత్తపీఠంలో తాము కూడా వ్రతాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయం వద్ద స్వామీజీకి దేవస్థానం ఈఓ కే. రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వారికి వేదాశీస్సులు అందజేయగా ఈఓ సత్యదేవుని ప్రసాదం, చిత్రపటం అందజేసి ఘనంగా సత్కరించారు.



సత్యదేవుని సన్నిధిలో సచ్చిదానంద స్వామీజీని సత్కరిస్తున్న ఈఓ రామచంద్రమోహన్

గర్భిణులకు వైద్య పరీక్షలు



కోటనందూరు పీహెచ్‌సీలో గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు శనివారం వైద్య సేవలు అందించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్యులు యామిని, రాజశేఖర్ గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ లగుడు శ్రీనివాసు చేతుల మీదుగా గర్భిణులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సర్పంచ్ సుర రాంబాబు, ఏఏబీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొరుప్రోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ రాజబాబు

శంఖవరం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో శనివారం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పర్వత సత్యనారాయణ మూర్తి, సభ్యులుగా ఈగల గంగావెంకట సతీష్, గుద్దాటి నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్నివిధాలా న్యాయం జరిగిందన్నారు. సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ పడాల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పడాల దొంగబాబు, కోన బాబ్జీ, యెడ్ల సత్యనారాయణ, ఈగల రాజు, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



వాహనంలో జన్మించిన బిడ్డను చూపుతున్న వైద్య సిబ్బంది

శంఖవరం: మండలంలోని గౌరంపేట పంచాయతీ రాజారం గ్రామానికి చెందిన టి.శాంతి కుమారి శనివారం 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. శాంతికుమారికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి కాల్ చేశారు. 108 సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని గర్భిణి శాంతికుమారిని రౌతులపూడి సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమెకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. జి.కొత్తపల్లి సమీపంలో కుటుంబ సభ్యుల సాయంతో 108 సిబ్బంది శాంతికుమారికి పురుడు పోశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చిందని తల్లీ,బిడ్డా క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో 108 వాహన పైలట్ ఎస్.ప్రసాద్, ఈఎంటీ టి.సాగర్ పాల్గొన్నారు.

14న ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ

జగ్గంపేట: ఏలేరు నదీ తీర గ్రామమైన ఇర్రిపాకలో శివాలయం సమీపాన ఈ నెల 14న ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. శివాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శృంగేరి పీఠాధిపతుల దివ్యాశీస్సులతో ఆది, సోమ, మంగళవారాల్లో అధివాసాలు నిర్వహించి, బుధవారం ఉదయం 10.58 గంటలకు ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిమలను ప్రతిష్ఠిస్తామని వివరించారు. భక్తులందరూ శివలింగాలను ప్రత్యక్షంగా తాకే విధంగా వాయు ప్రతిష్ఠ చేస్తామని చెప్పారు. అలాగే, శివరాత్రి సందర్భంగా ఇర్రిపాకలో కోటి పార్థివ శివలింగార్చన సహిత రుద్రయాగం, మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నామని నెహ్రూ తెలిపారు. పార్థివ లింగాల తయారీలో వేలాది మంది మహిళలు పాల్గొంటున్నారన్నారు. ఇప్పటికే సుమారుగా 90 లక్షలకు పైగా పార్థివ లింగాలు సిద్ధమయ్యాయన్నారు. ఈ నెల 26 నుంచి మహా కుంభాభిషేక సహిత రుద్రయాగం జరుగుతుందని, 11 రోజుల పాటు జరిగే ఈ క్రతువులో పలువురు పీఠాధిపతులు పాల్గొంటారని చెప్పారు.



ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన బ్రోచర్ విడుదల చేస్తున్న నెహ్రూ

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి



ప్రత్తిపాడులో ప్రచార ర్యాలీ చేస్తున్న లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు

ప్రత్తిపాడు: జాతీయ గ్రామీణ కార్మిక సంఘం పిలుపు మేరకు ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (ఆయర్లా) ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, అల్లూరి జంక్షన్‌లతో పాటు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. మోదీ ప్రభుత్వాన్ని ఓడించండి.. బీజేపీకి మద్దతుగా ఉన్న ప్రాంతీయ పార్టీలను వ్యతిరేకించండి... సమాన పనికి సమాన వేతనం చెల్లించండి.. అంటూ ఆయర్లా నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆయర్లా జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు కె.జనార్దన్, సామిరెడ్డి నారాయణమూర్తి, పేరూరు లక్ష్మి, తాడి లక్ష్మణరావు, కాదా నాగేశ్వరరావు, గుంటబోయిన చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

ఏలేశ్వరం: ప్రయాణికుల సమస్యలు యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రయాణికులు ఫోన్ చేసి తమ గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపాలని కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని డీఎం సత్యనారాయణ తెలిపారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాలుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గండేపల్లి/జగ్గంపేట: అనారోగ్యానికి గురైన బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు వైఎస్సార్ సీపీ నాయకులు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట మండలం కాట్రావులపల్లికి చెందిన జగత దుర్గాప్రసాద్ కుమారుడు వరసిద్ధి వెంకటేశ్వరరావు పుట్టినప్పటి నుంచి మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అతడికి మెరుగైన వైద్యం చేయించాలని వైద్యులు సూచించారు. తనకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల సాయం కోసం బాలుడి తండ్రి దుర్గాప్రసాద్ ఎదురు చూశారు. సమస్యను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కాట్రావులపల్లికి చెందిన ఎస్ఆర్‌బి కల్లేపల్లి రాజేష్‌కు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన రాజేష్ రూ.50,000, వైఎస్సార్ సీపీ గ్రామ ప్రధానకార్యదర్శి తోరాటి వీరబాబు రూ.5000 సమకూర్చారు. ఈ నగదులు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు బాధితుడి తండ్రి దుర్గప్రసాద్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సమస్యను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురుమిల్లి దొరబాబు, దంగేటి శ్రీను, పైలా ప్రసాద్, మాదిబోయిన సూరిబాబు, తాతపూడి జగదీష్, బంగారం ప్రసాద్, అరుణ, నిమ్మలపూడి శ్రీహరి, కొండిపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ సూచించారు. కిర్లంపూడిలో పార్టీ శ్రేణులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న మండలంలోని లబ్ధిదారులకు నాలుగో విడుత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ చేస్తారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై కార్యకర్తలు, అధికారులతో సమీక్షించామన్నారు. అనంతరం చెక్కుల పంపిణీ చేసే ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ పెనగంటి రాజేష్, తోట వరహాలయ్య, అడారి మహేష్, ఓలేటి రాజు, బేరి బాబ్జీ, పాముల చంటి, కర్రి వెంకటరమణమూర్తి, పీలా సుబ్బు, జోకా శ్రీను, వేగి రామకృష్ణ, ఏపీఎం ఐ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న తోట బాబ్జీ, పార్టీ కార్యకర్తలు

‘అల్లూరి’కి భారతరత్న ప్రకటించాలి

తుని: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు డిమాండ్ చేశారు. జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రతినిధులు శనివారం అల్లూరి చదువుకున్న స్థానిక రాజా హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ అల్లూరి పేరు మీద రూ.125 రూపే నాణేన్ని విడుదల చేయాలన్నారు. తొలుత పాఠశాలలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ, కార్యదర్శి శ్యామలవరలక్ష్మి, సంఘ ప్రతినిధులు లక్కాకుల బాబ్జీ, శివంగి నాగేశ్వరరావు, పోతిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తునిలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

సంక్షిప్తంగా..

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో దూర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పంచహారతులు సమర్పించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకన్న దర్శనానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి జీయ్యన్న, వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సత్తెమ్మతల్లి జాతర ప్రారంభం

ప్రత్తిపాడు: గ్రామంలో వేంచేసిన సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక రాజు గారి వీధిలోని ఆలయానికి కొత్తపేట నుంచి వంశీకులు అమ్మవారిని మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ తీసుకువచ్చి ఆలయంలోని గద్దెపై ఆశీనులు గావించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తుని: స్థానిక గణపతినగర్ పార్కు వద్ద ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు సిటీ వాకర్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వాకర్స్‌కు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు, వాకర్స్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఏలేశ్వరం: స్థానిక 10వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శనివారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేత కోరాడ ప్రసాద్ చిన్నారులతో మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట టిక్కెట్ నాదే..

జగ్గంపేట: కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం నుంచి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. గతంలో జగ్గంపేటలో జరిగిన సమావేశంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ విషయం తెలిపారన్నారు. స్వగ్రామం ఇర్రిపాకలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనసేన, టీడీపీ పొత్తు ఉన్నప్పటికీ జగ్గంపేట నియోజకవర్గం నుంచి తన అభ్యర్థిత్వంలో ఎటువంటి మార్పూ ఉండబోదని చెప్పారు. కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ఏ పార్టీ అయినా సమర్థత కలిగిన స్థానిక నేతకే టికెట్టు ఇవ్వాలన్నారు. సూట్‌కేసులు పట్టుకు వెళ్లే నేతలకు ఎంపీ టిక్కెట్లు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు.